క్లుప్తంగా

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి ఏయూ డాక్టరేట్



వీసీ ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరిస్తున్న అధ్యాపకుడు ఇంద్రసేన

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు పి. ఇంద్రసేనకు ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టరేట్ వరించింది.రాజనీతి,ప్రభుత్వ పాలనా శాస్త్రం విభాగ విశ్రాంత ఆచార్యులు ఈపి నారాయణ, డాక్టర్ పి.ప్రేమానందం సంయుక్త పర్యవేక్షణలో రోల్ ఆఫ్ ఎన్జీవో ఇన్ డిజాస్టర్ మేనేజ్మెంట్ ఇన్ నార్త్ కోస్టల్ డిస్ట్రిక్ట్స్-ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై ఇంద్రసేన జరిపిన పరిశోధనకు గానూ డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు ఇంద్రసేనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి తదితరులు అభినందించారు.

ఆక్రమణల తొలగింపు

సింహాచలం: చినముషిడివాడ దరి కార్మికనగర్‌లో ఆక్రమణలను శుక్రవారం ట్రైనీ కలెక్టర్ కీర్తి ఆధ్వర్యంలో అధికారులు తొలగించారు. ఇక్కడి చెరువులో 5 ఇళ్ల నిర్మాణాలు, ఒక నిర్మాణంలో ఉన్న కట్టడాన్ని ట్రైనీ కలెక్టర్ గుర్తించారు. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. ఈమేరకు సిబ్బంది తొలగించారు.

క్రీడల్లో రాణిస్తే గుర్తింపు



సాఫ్ట్‌బాల్, బేస్ కోర్టును ప్రారంభిస్తున్న రామ్మోహన్

పరవాడ: చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రముఖ జర్నలిస్ట్ జి.ఎస్. రామ్మోహన్ అన్నారు. పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఏర్పాటు చేసిన సాఫ్ట్ బాల్, బేస్ బాల్ కోర్టులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన క్రీడలను ప్రోత్సహిస్తున్న పాఠశాల చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్, స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు, కోచ్‌లు బి.రాజేష్‌కుమార్, మనీష్, బషీర్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు అందుకున్న విద్యార్థులు

సింహాచలం: పెందుర్తి శ్రీచైతన్య స్కూల్లో శుక్రవారం ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యూకేజీ పూర్తి చేసుకుని ఒకటో తరగతిలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులకు స్నాతకోత్సవం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.తారకేశ్వరరావు, ఉత్తరాంధ్ర పాఠశాలల ఏజీఎం ఎం.వి.సురేష్, పాఠశాలల రీజినల్ ఇన్‌చార్జి ఆశిబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వారణాసి రైలుకు మరిన్ని కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల అనూహ్య స్పందన నేపథ్యంలో విశాఖ-బనారస్-విశాఖ మధ్య నడుస్తున్న వీక్లీ స్పెషల్ రైలుకు ఈ నెల 26 నుంచి 1-సెకండ్ ఏసీ , 1-థర్డ్ ఏసీ కోచ్‌లను అదనంగా జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ఆయా తేదీల నుంచి ఈ రైలు 2-సెకండ్ ఏసీ , 4-థర్డ్ ఏసీ , 12-స్లీపర్ క్లాస్, 2-జనరల్ సెకండ్ క్లాస్, 2-సెకండ్ క్లాస్ కం లగేజీ కం దివ్యాంగుల కోచ్‌లతో నడుస్తాయి.

గౌహతి-సికింద్రాబాద్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

గౌహతి-సికింద్రాబాద్-గౌహతి మధ్య నడుస్తున్న రైలుకు ఈ నెల 27నుంచి నుంచి ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం తెలిపారు.

గౌహతిలో బయల్దేరే గౌహతి-సికింద్రాబాద్ (12514) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 27 నుంచి, తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్‌లో బయల్దేరే సికింద్రాబాద్-గౌహతి (12513)ఎక్స్‌ప్రెస్‌కు 29వ తేదీ నుంచి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను జతచేస్తున్నారు.

7 కరోనా కేసులు నమోదు

మహారాణిపేట: విశాఖలో శుక్రవారం ఏడు కరోనా కేసులు నమోదయ్యాయి. 24 గంటల్లో 244 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఏడుగురికి కరోనా నిర్ధారణ అయింది. దీంతో మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 30కి చేరింది. 13 మంది డిశ్చార్జ్ అయ్యారు. 30 మంది చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

రెచ్చిపోతున్న మట్టిమాఫియా!



మట్టి తవ్వకాలతో గుంతలమయంగా మారిన అయ్యన్నపాలెం భూదేవి చెరువు

భూదేవి చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలింపు

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో మట్టిమాఫియా రెచ్చిపోతుంది. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులు.. మెట్ట ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి వేళ తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఇష్టాను సారంగా తవ్వకాలు చేయడంతో చెరువులు, మెట్ట ప్రాంతాలు ప్రమాదకరంగా మారుతున్నాయి.

తాజాగా అయ్యన్నపాలెం భూదేవి చెరవులో..

ఇప్పటికే మండలంలోని పలు ప్రాంతాల్లో రెచ్చిపోయిన మట్టిమాఫియా తాజాగా అయ్యన్నపాలెం భూదేవి చెరువుపై పడింది. గురువారం రాత్రి కొంత మంది పొక్లెయిన్ సాయంతో ట్రాక్టర్లతో తెల్లవార్లు మట్టి అక్రమంగా తరలించుకు పోయారు. విషయం తెలుసుకున్న అయ్యన్నపాలెం గ్రామ ఉప సర్పంచ్ బుదిరెడ్ల కనకరాజు చెరువు వద్దకు వెళ్లిగా అప్పటికే వారంతా పరారయ్యారు. సబ్బవరం మండలానికి ఆనుకుని ఉన్న కోటపాడు మండలంలోని సూదివలస,పాతవలస తదితర గ్రామాలకు మట్టి కొంతమంది గుట్టు చప్పుడు కాకుండా తరలించుకుపోతున్నారని కనకరాజు చెబుతున్నారు. రెండు మండలాల సరిహద్దులో భూదేవి చెరువు ఉండడంతో అక్రమార్కులకు బాగా కలిసివస్తుందని ఉప సర్పంచ్ తెలిపారు. రాత్రి వేళ పోలీసులు,ఇరిగేషన్,మైనింగ్,విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టాలని ఆయన కోరారు.

పుస్తక రివ్యూ పోటీల్లో గురుకుల విద్యార్థి ప్రతిభ



వెంకట భవానికి ప్రశంసాపత్రం అందిస్తున్న సంజీవరావు, రూపవతి

గోపాలపట్నం: మేహాద్రి గెడ్డలోని గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని బి. వెంకటభవాని ప్రతిభ చాటింది. ఇటీవల మానవ కంప్యూటర్ శకుంతలాదేవి జయంతి సందర్భంగా విశాఖ జిల్లా డీసీవో కార్యాలయంలో గురుకుల పాఠశాలల అకడమిక్ మానటరింగ్ అధికారి ఆధ్వర్యంలో 'సంకెళ్లను తెంచుకుంటూ' అనే పుస్తకానికి రివ్యూ రాసే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మేహాద్రి గెడ్డ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి బి.వెంకట భవాని ప్రథమ బహుమతి సాధించింది. ఈ మేరకు అనకాపల్లి జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయ కర్త ఎన్. రూపవతి, గురుకుల పాఠశాల అకడమిక్ మానటరింగ్ అధికారి ఎస్. సంజీవరావు చేతుల మీదుగా బహుమతి అందుకుంది. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ మృదుల ప్రియదర్శిని, ఉపాధ్యాయులు వెంకట భవానిని అభినందించారు.

బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సింహాచలం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, తక్షణమే నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని సీపీఐ,సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 26న కూర్మన్నపాలెం జంక్షన్‌లో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. సుజాత నగర్‌లోని భగత్‌సింగ్ భవన్‌లో ఏఐటీయూసీ జోన్-8వ కార్యాలయంలో శుక్రవారం బహిరంగసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు రాంబాబు, శ్రీనివాస్ మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు, విద్యావంతులు, ఉద్యోగ, ఉపాధ్యాయులంతా పెద్ద ఎత్తున తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అనిత, సీత, ఈశ్వరమ్మ, శైలు పాల్గొన్నారు.

వర్సిటీ ఉద్యోగి త్రిమూర్తులు మృతికి సంతాపం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగి జంగా త్రిమూర్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై ఏయూ ఆచార్యులు, ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం సంతాప సభ ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ వర్సిటీ ఉద్యోగిగా అందరికీ సహాయకారిగా త్రిమూర్తులు ఉండేవారని గుర్తుచేసుకున్నారు. దళిత ఉద్యమాలలో చురుకైన భూమిక పోషించేవారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కె.వెంకటరావు, ఆచార్య జాలాది రవి, ఉద్యోగులు ఇసుకపల్లి వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, పరిశోధకులు డాక్టర్ బి.మోహన్‌బాబు, డాక్టర్ కల్యాణ్, డాక్టర్ శాంతారావు, డాక్టర్ రాజ్‌కుమార్, వెంకట్, జాబ్జీ, ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.



జంగా త్రిమూర్తులు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆచార్యులు, ఉద్యోగులు

పదేళ్లు దాటితే ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్‌వో శ్రీనివాస మూర్తి

మహారాణిపేట: ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు దాటితే కచ్చితంగా అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాస మూర్తి అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ రెండో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు ద్వారా బ్యాంక్ ఖాతా, సిమ్ కార్డ్, వివిధ ఉపకార వేతనాలు, ఆదాయపు పన్ను, బ్యాంకు రుణాలు, ఒక దేశం ఒక రేషన్ కార్డు కింద దేశంలో ఎక్కడైనా సరుకులు పొందేందుకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను నవీకరించిన ఆధార్‌తో పొందవచ్చని ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని ఆయన సూచించారు. దీనికోసం ఏదైనా అడ్రస్ ప్రూఫ్, ఐడెంటిటీ ప్రూఫ్‌తో దగ్గరలోని ఆధార్ కేంద్రం, మండల ప్రధాన కేంద్రంలోని సచివాలయం, బ్యాంకులు, పోస్ట్ ఆఫీస్, వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో గాని అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. జూన్ నెల 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఆధార్ అప్‌డేట్ ఉచితమని పేర్కొన్నారు. అడ్రస్ ప్రూఫ్ లేనట్లయితే వారి సచివాలయంలో 20/- చెల్లించి సర్టిఫికెట్ పొందవచ్చని తెలిపారు . జిల్లాలో ఇంకా ఆధార్ అప్ డేట్ చేసుకోని వారు సుమారు 4 లక్షల మంది ఉన్నారన్నారు. ఆధార్ అప్ డేట్‌కు సంబంధించిన సమాచారం, వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1947తో పాటు వెబ్ సైట్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎల్డీవో పూర్ణమా దేవి, జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయ ణ, యూఐడీఏఐ రీజినల్ మేనేజర్ గిరిధర్, వైద్య ఆరోగ్య శాఖ, బ్యాంకింగ్, పోస్టల్, ఎడ్యుకేషన్, బీఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి(క్లరికల్) సిహెచ్.సుబ్బిరెడ్డి మాట్లాడుతూ అరబిందో ఫార్మా, దక్కన్ ఫైన్ కెమికల్స్, అపోలో ఫార్మా, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, జయభేరి ఆటో మొబైల్స్, సుగుణ ఫుడ్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్ కంపెనీ, ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 723 ఖాళీల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించగా.. 234 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి ఉమాదేవి అభ్యర్థులకు ఇంటార్వ్యూలు చేశారు. సుమారు 142 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు సుబ్బిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి(టెక్నికల్) కె.సుధా, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో పాల్గొన్న అభ్యర్థులు

ముడిసరకు నిలిపివేత ప్రైవేటీకరణలో భాగమే..

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమకు ముడిసరకును అందించి పూర్తి స్థాయి ఉత్పత్తి దిశగా సంస్థను నడపాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 799వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకుడు డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్లాంట్‌ను ఆపేయాలనే అలోచనతోనే ముడిసరుకు అందించకుండా చేస్తున్నారని ఆరోపించారు. ముడి సరకు అందించకుండా కార్మికులకు పని లేకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదంతా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ కుట్రలో భాగమేనని అన్నారు.

సింహగిరిపై భారీ షెడ్డు నిర్మాణం



సింహగిరి మాడవీధుల్లో నిర్మించిన షెడ్డు

సింహాచలం: సింహగిరిపై నిర్మించిన భారీ షెడ్డు పూర్తయింది. సింహగిరి మాడ వీధుల్లో భక్తులకు నీడ కల్పించేందుకు 27 అడుగుల ఎత్తులో 25వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో లారస్ ల్యాబ్స్ సుమారు రెండు కోట్లతో భారీ షెడ్ నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. ఈమేరకు షెడ్ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. ఎండ వేడిమికి తట్టుకునేలా తెల్లని పైకప్పుతో భారీ షెడ్డు నిర్మించారు. చందనోత్సవానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం షెడ్డు అందుబాటులోకి తీసుకురానున్నారు.

భయం వీడితే విజయం మనదే

- వ్యక్తిత్వ నిపుణుడు సుధీర్



మాట్లాడుతున్న సుధీర్

గోపాలపట్నం: భయం వీడితే విజయం వరిస్తుందని వ్యక్తిత్వ వికాస నిపుణుడు సుధీర్ అన్నారు. బెహరా కళాశాలలో శుక్రవారం వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. కార్యక్రమాన్ని విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ బెహరా విజయచైతన్య ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థు ల్లో మనో ధైర్యాన్ని నింపేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇక్కడి విద్యార్థులు సృజనాత్మకతతో బయటకు వెళ్తారని చెప్పా రు. సుధీర్ మాట్లాడుతూ పరీక్షలు సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురకావద్దని సూచించారు. ప్రణాళికా బద్ధంగా చదివితే నిరాశ దరి చేరదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు సుకన్య, లీలాప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశీల వేలం పాటలో కాంట్రాక్టర్ల కుమ్మక్కు?

- రూ.62.56 లక్షలకే ముగించేసిన వైనం

జగదాంబ: పూర్ణామార్కెట్(సర్దార్ వల్లభాయ్ పటేల్ మార్కెట్) ఆశీల వేలం పాటలో కాంట్రాక్టర్లు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే తక్కువ ధరావత్తుకు వేలం పాట ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. జీవీఎంసీ జోన్-4 పరిధిలో పూర్ణామార్కెట్, రామకృష్ణ రైతుబజార్ పెద్ద మార్కెట్లు. ఏటా జోనల్ కార్యాలయంలో ఆశీల వేలం పాట నిర్వహిస్తారు. గతేడాది పూర్ణామార్కెట్ ఆశీల పాట వేలం రూ.87.20లక్షలకు ఖరారు కాగా.. జీఎస్టీ, స్వచ్ఛభారత్ ట్యాక్స్ కలిపి మొత్తం రూ.1.20 లక్షలు వరకు అయ్యింది. ఈ ఏడాది కనీస మొత్తం కలిపి రూ.80 లక్షలకు కూడా వెళ్లకుండా పాటను పదే పదే వాయిదా వేయించారు. చివరికి గురువారం జరిగిన పాటలో రూ.62.56 లక్షలకు ఖరారైంది. ఈ ప్రక్రియ అంతా కేవలం 15 నిమిషాల్లో జరిగిపోవడం విమర్శలకు తావిస్తోంది. పైగా రాత్రికి రాత్రే కాంట్రాక్ట్‌ను అప్పగించేందుకు జోనల్ కార్యాలయంలో పేపర్లు సిద్ధం చేసినట్లు తెలిసింది. అలాగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో టేబుల్ అజెండా కింద పాస్ చేయించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. రామకృష్ణ రైతుబజార్ వేలం పాట కూడా తక్కువ ధరావత్తుకే వెళ్లింది. దీనిపై జీవీఎంసీ ఉన్నాతాధికారులు విచారణ చేపట్టి.. వేలం పాట మళ్లీ నిర్వహించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

రైతుబజార్ల అభివృద్ధికి కార్యాచరణ

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ



వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న చైర్మన్ బీఎస్ కృష్ణ తదితరులు

గోపాలపట్నం: రైతు బజార్ల అభివృద్ధి, ఆదాయ లక్ష్యాల సాధనకు తగిన ప్రణాళికలు చేస్తున్నామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ అన్నారు. గోపాలపట్నంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం సాధారణ సమావేశం నిర్వహించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ ఫీజు రూ. 220లక్షల వసూలు చేయాలన్న లక్ష్యాన్ని చేరుకున్నట్టు చెప్పారు. లక్ష్యాలు చేరుకోవడానికి సహకరించిన సిబ్బందిని అభినందించారు. అలాగే 2023-24 సంవత్సర బడ్జెట్‌ను సమావేశంలో ఆమోదించారు. రైతు బజార్ల నిర్వహణ, రైతుల, వినియోగదారుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యువతారెడ్డి, పాలక వర్గ సభ్యులు ఎస్. సన్యాసిరావు, టి.రమణమ్మ, టి. ప్రసూన, సీహెచ్ వరలక్ష్మి, మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ పి. పాపారావు, మార్కెటింగ్ అధికారి ఎస్‌కే యాసిన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'గడప గడపకు'..



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడం.. అర్హులైనవారందరికీ సంక్షేమ పథకాలు అందించే ధ్యేయంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 95వవార్డు 500 సచివాలయం పరిధి పార్లపాలెంలో ఎమ్మెల్యే శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సాంకేతిక కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందకపోతే అవి ఏవిధంగా అందించాలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు , నాయకులు మాధవరావు, గుణాకర్, చిన్నారావు,కాశీ,రామునాయుడు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో ఘనంగా ఇఫ్తార్ విందు

అగనంపూడి: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా అగనంపూడి సాయిబాబా ఆలయంలో శుక్రవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మసీద్ ఈ అబూబర్ అధ్యక్షుడు మీరా మొహిద్దీన్ మాట్లాడుతూ మతాల ప్రమేయం లేకుండా హిందూ, ముస్లింలు సఖ్యతతో సోదర భావంతో మెలుగుతూ దేశ సమగ్రతను కాపాడుకుంటున్నామన్నారు. సాయి మందిర కమిటీ ప్రతీ ఏటా ఇఫ్తార్ విందు ఏర్పాటు సంప్రదాయంగా కొనసాగడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మీరా మొహిద్దీన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కె.వి.రమణారెడ్డి, నాయకులు బి.సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు డి.వ్యాస శర్మ, జి.శంభుడు, పి.సత్యనారాయణ, సత్యవతి, లీలావతి, పంకజం తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ సందర్భంగా ముస్లిం పెద్దలను సత్కరిస్తున్న సాయి మందిరం ప్రతినిధులు

స్ఫూర్తి నింపే సివిల్ సర్వీసెస్ డే

మహారాణిపేట : ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి, వారిలో స్ఫూర్తి నింపేందుకే జాతీయ సివిల్ సర్వీసెస్ రోజును ప్రతి ఏడాది ఏప్రిల్ 21వ తేదీన జరుపుకుంటున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 16వ జాతీయ సివిల్ సర్వీసెస్ రోజును ఘనంగా నిర్వహించారు. దేశంలోని వివిధ పబ్లిక్ సర్వీస్ విభాగాల్లో నిమగ్నమై ఉన్న అధికారుల పనిని గుర్తించేందుకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 21న దీనిని పాటిస్తారన్నారు. అనంతరం 16వ జాతీయ సివిల్ సర్వీసెస్ రోజు సందర్భంగా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగుల చేత జాయింట్ కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణ మూర్తి, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ విశ్వనాథన్

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్, గన్నవరం-ముస్తాబాద-గుణదల సెక్షన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం ఆ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. కింద పేర్కొన్న రైళ్లు ఆయా తేదీల్లో రెగ్యులర్ మార్గం నిడదవోలు-ఏలూరు-విజయవాడల మీదుగా కాకుండా వయా నిడదవోలు-భీమవరం టౌన్-గుడివాడ-విజయవాడల మీదుగా నడుస్తాయి.

- ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖలో బయలుదేరే విశాఖపట్నం-గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్..
- ఈ నెల 21న ధన్‌బాద్‌లో బయలుదేరిన ధన్‌బాద్-అలెప్పి(13351) బొకారో ఎక్స్‌ప్రెస్..
- ఈ నెల 21న టాటానగర్‌లో బయలుదేరే టాటానగర్-బెంగళూరు(12889) ఎక్స్‌ప్రెస్..
- ఈ నెల 22న హతియాలో బయలుదేరే హతియా-బెంగళూరు(18637) ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించిన మార్గంలో నడుస్తాయి.



స్వచ్ఛ క్యాంపస్‌లో సైనికోద్యోగులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛక్యాంపస్ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వర్సిటీలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న సైనికోద్యోగులు భాగస్వాములయ్యారు. స్వయంగా శ్రమదానం చేసి వర్సిటీలో పలు ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సైనికోద్యోగులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి అభినందిచారు. వర్సిటీని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో సైనికోద్యోగులు భాగం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, శానిటేషన్-బ్యూటిఫికేషన్ విభాగం డీన్ డాక్టర్ ఉజ్వల్ కుమార్ ఘటక్, కల్నల్ మణికుమార్, ఎం.వి.ఎస్.రాజు, సత్వీర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.



శ్రమదానంలో పాల్గొన్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించనున్న 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ రేషనల్ డ్రగ్ డిస్కవరీ'జాతీయ సదస్సు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్ పదవీ విరమణ పురస్కరించుకుని ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య జి.గిరిజా శంకర్, వి.గిరిజా శాస్త్రి, కె.ఈశ్వర్‌కుమార్, ఎం.మురళీకృష్ణ కుమార్, కృష్ణ మంజరి పవార్, తదితరులు పాల్గొన్నారు.



సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి